క్లుప్తంగా

శ్రీవారికి పూజలు


అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచమి శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మి అలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా బాలిరెడ్డి


మాలపాటి బాలిరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ స్టేట్ జాయింట్ సెక్రటరీగా మార్కాపురం పట్టణానికి చెందిన మాలపాటి బాలిరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ తాను ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని, తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జంకె వెంకటరెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

విద్యార్థులు సమాజానికి దిక్సూచి కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు సమాజానికి దిశా నిర్దేశం చేసే దిక్సూచి కావాలని గిద్దలూరు సబ్‌జైలు సూపరింటెండెంట్ యు. లింగారెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వారి విలువైన సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, విశ్రాంత ఉపాధ్యాయులు బి.రామిరెడ్డి, యువ ప్రగతి పథం సంస్థ నిర్వాహకులు ఫరూక్, ఐటీ ఉద్యోగి రత్నం, శిక్షకులు నిత్యసాయి, ఎస్.సాయికుమార్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధి రహిత గ్రామంగా గౌతవరం


టీబీ ముక్తి అవార్డు తీసుకుంటున్న సర్పంచ్ లక్ష్మీదేవి

రాచర్ల: మండలంలోని గౌతవరం గ్రామాన్ని టి.బి వ్యాధి రహిత గ్రామంగా ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 72 గ్రామ పంచాయతీలను క్షయ వ్యాధి రహిత పంచాయతీలుగా గుర్తించారు. అందులో భాగంగా మండలంలోని గౌతవరంను ఎంపిక చేయడంతో సర్పంచ్ మార్తోట లక్ష్మీదేవికి జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ చేతులు మీదుగా అవార్డు అందజేశారు. టి.బి ముక్తి రహితగా గౌతవరం గ్రామానికి అవార్డు దక్కడంతో మండల అధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన చేశారు.

రేషన్ బండి ఇక రాదండి..

- ఎండీయూ వాహనాలు రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- డీలర్లతో రేషన్ సరుకుల పంపిణీ
- నేటి నుంచి రేషన్ షాపులకు పరుగులు పెట్టాల్సిందే
- లబ్ధిదారులకు మళ్లీ ఇక్కట్లే
- ప్రభుత్వ నిర్ణయంపై కార్డుదారుల ఆవేదన
- ఉపాధి కోల్పోతున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు


ఇంటింటికీ రేషన్ అందిస్తున్న ఆపరేటర్ (ఫైల్)


ఎండీయూ వాహనాలతో రేషన్ పంపిణీ (ఫైల్)

బేస్తవారిపేట/కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేసిన ఒక్కో పథకాన్నీ ఎత్తేస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీకి మంగళం పాడింది. ఎండీయూ వాహనాలను రద్దుచేసి లబ్ధిదారులకు నేటి నుంచి రేషన్ షాపుల వద్దే రేషన్ సరుకులు ఇవ్వటానికి సిద్ధమైంది. రేషన్ సరుకుల దుకాణం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి సరుకులు అందించే పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా నిరుద్యోగులైన యువతకు ఉపాధి లభించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ చర్యలతో మళ్లీ రేషన్ కోసం లబ్ధిదారులు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట మండలంలో చెన్నుపల్లె, బార్లకుంట, బాలేశ్వరపురంలో రేషన్ దుకాణాలు లేకపోవడంతో నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి. కొమరోలు మండలంలో గుంతపల్లె నుంచి 5 కి.మీ దూరంలోని సూరవారిపల్లికి, పాయిలపల్లె నుంచి 5 కి.మీ దూరంలోని బాదినేనిపల్లెకు, ఎర్రగుంట్ల నుంచి 2 కి.మీ దూరంలోని అల్లినగరం, బావాపురం నుంచి 2 కి.మీ దూరంలోని గోపాలునిపల్లె, హనుమంతరాయునిపల్లె నుంచి కొమరోలుకు 3 కిలోమీటర్లు రావాలి. తిమ్మారెడ్డిపల్లె నుంచి 4 కి.మీ దూరంలోని అల్లినగరం, రైతుపల్లి నుంచి 2 కి.మీ దూరంలోని రాజుపాలెం, నరసింహునిపల్లె, కృష్ణంపల్లి నుంచి 2 కి.మీ దూరంలోని ఎడంకల్లుకు, ఒట్టి వేపమానుపల్లె నుంచి 5 కి.మీ దూరంలోని అల్లినగరం, అయ్యవారిపల్లె, బొంతపల్లె నుంచి హైవేరోడ్డు దాటి 3 కి.మీ దూరంలోని నల్లగుంట్లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పునకు కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి. కూలీ పనులు మానుకుని, గంటల తరబడి చౌకదుకాణాల ముందు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీలర్ షాపు తెరుస్తాడో..లేదో తెలియక ప్రదక్షిణలు చేయాలి. తమకు ఇకపై ఇక్కట్లు తప్పవని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో 83,629 బియ్యం కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ 53 ఎండీయూ వాహనాలతో గత ఐదేళ్లుగా ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరఫరా చేశారు.

గిద్దలూరు నియోజకవర్గంలో రేషన్ కార్డులు, ఎండీయూ వాహనాల వివరాలు

మండలం	రేషన్ షాపుల సంఖ్య	ఎండీయూల సంఖ్య	రేషన్‌కార్డుల సంఖ్య
అర్ధవీడు	29	7	10506
బేస్తవారిపేట	39	10	14959
కంభం	31	8	12838
గిద్దలూరు	53	15	23472
కొమరోలు	26	7	11666
రాచర్ల	27	6	10188

➤ కొనకనమిట్ల మండలంలో 26 గ్రామ పంచాతీలలో 30 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటిలో 14971 కార్డులు ఉన్నాయి.

ఉపాధి కోల్పోనున్న ఎండీయూ ఆపరేటర్లు

కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం వల్ల ఎండీయూ వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోనుండగా, ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహన ఆపరేటర్లు ఉపాధి కోల్పోనున్నారు. ఆపరేటర్ల ఉపాధిపై కూటమి ప్రభుత్వం దెబ్బకొట్టింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆపరేటర్లు రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రతి వాహనానికి ఆపరేటర్‌తో పాటు హెల్పర్ ఉంటారు. వీరికి ప్రతి నెలా వివిధ రకాల వాటి కోసం ప్రభుత్వం రూ.21 వేలు చెల్లించేది. నేటి నుంచి ఎండీయూ వాహన సేవలు మూలన పడనుండటంతో ఆపరేటర్లు, హెల్పర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

రేషన్ కోసం 3 కి.మీ వెళ్లాలి



మా గ్రామంలో రేషన్ షాపు లేదు. గత ఐదేళ్లుగా మా గ్రామంలోకి ఎండీయూ వాహనం వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. ఇక నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న గలిజేరుగుళ్లలో రేషన్‌షాపునకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి.
– లక్కమనేని తిరుమలమ్మ, చెన్నుపల్లె, బేస్తవారిపేట మండలం

నాలుగు కిలోమీటర్లు నడవాలి



రేషన్ సరుకుల కోసం నాలుగు కిలోమీటర్లు నడవాలి. మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. గ్రామంలోని అందరూ అంతదూరం వెళ్లి రేషన్ ఎలా తెచ్చుకోవాలి. ఎండీయూ వాహనాలతో గత ఐదేళ్లుగా ఎటువంటి ఇబ్బందిలేకుండా తీసుకున్నాం.
– కె.వెంకటేశ్వర్లు, బార్లకుంట, బేస్తవారిపేట మండలం

జీవనాధారం మీద దెబ్బకొట్టారు..



ఎండీయూ వాహనాల ద్వారా జీవనాధారం పొందున్న మాలాంటి వారి మీద కూటమి ప్రభుత్వం కక్ష కట్టి దెబ్బకొట్టింది. ప్రతి నెల 15వ తేదీలోగా ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు లబ్ధిదారులకు పంపిణీ చేసి వారి మన్ననలు పొందాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాహనాలను రద్దు చేయటంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయంతో ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడనున్నాయి.
– కె.రాజేష్, ఎండీయూ వాహన ఆపరేటర్, కొనకనమిట్ల మండలం

రద్దు చేయటం మంచిది కాదు



ప్రతి నెలా కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేయకుండా ఉంటే బాగుండేది. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని రద్దు చేయడం వలన గ్రామాల్లో ప్రజలు ప్రతి నెలా ఇబ్బందులు పడాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దూరంగా ఉండే రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి అతి కష్టం మీద సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది.
– కోండ్రు వెంకటేశ్వర్లు, నాగంపల్లి, కొనకనమిట్ల మండలం

పార్టీ బలోపేతానికి కృషిచేస్తా

● వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా నెమలిదిన్నె చెన్నారెడ్డి


నెమలిదిన్నె చెన్నారెడ్డి

కంభం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా నియమితులైన కంభం మాజీ ఏఎంసీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి అన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకొని పోతూ పార్టీ ఆదేశించి కార్యక్రమాలను విజయవంతం చేసేలా పని చేస్తానన్నారు. రాష్ట్ర స్థాయి పదవి పొందిన చెన్నారెడ్డిని గిద్దలూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

నేడు ముండ్లపాడులో అంకాలమ్మ తిరునాళ్ల

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో ఆదివారం అంకాలమ్మ తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆరు పండ్ల సైజు ఎడ్లకు బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

ఆటల పోటీలతో మనో వికాసం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

బేస్తవారిపేట: ఆటల పోటీలు, యోగాతో విద్యార్థుల్లో మనో వికాసాన్ని పెంచుతాయని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులకు చెస్, యోగా, డ్రాయింగ్, ఇంగ్లిషు గ్రామర్, పేపర్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో పఠనాభిలాష పెంచేందుకు, సృజనాత్మకశక్తిని ప్రోత్సహించేందుకు విజ్ఞాన శిబిరం ఎంతగానో దోహదపడాతయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు సామ్యూల్ జార్జి

● మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


సామ్యూల్ జార్జికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: జిల్లాలో వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో విద్యాభివృద్ధికి డాక్టర్ సామ్యూల్ జార్జి విశేషంగా కృషి చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం డాక్టర్ జార్జ్ 93వ జయంతి సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాలలో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో పేద విద్యార్థులకు కార్పొరేట్, సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో జిల్లాలో మొదటి ఇంజినీరింగ్ కాలేజీని సుమారు 29 సంవత్సరాల కిందటే ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇంకా రాయలసీమ జిల్లాలో పలుచోట్ల బీఈడీ, ఫార్మసీ కళాశాలలను ఏర్పాటు చేసి సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ ఏడాది తమకు అటానమస్ స్టేటస్, నాక్ ఏ గ్రేడ్ రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను జార్జి కళాశాలలో అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, కళాశాల సిబ్బంది, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

అతివేగంతోనే ప్రమాదాలు


రికార్డులు తనిఖీ చేస్తున్న గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య

కొమరోలు: వాహనదారులు వేగంగా వాహనాలను నడపడం వలనే రహదారి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, నిండు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య తెలిపారు. కొమరోలులోని పోలీసుస్టేషన్‌ను శనివారం గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులపై కొమరోలు ఎస్సై నాగరాజును ఆరా తీశారు. పెండింగ్ కేసులు లేకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం మీడియా సమావేశంలో సీఐ రామకోటయ్య మాట్లాడుతూ ఇటీవల తాటిచెర్లమోటులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడగా, శుక్రవారం యర్రపల్లె గ్రామసమీపంలో ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడటానికి కారణం వాహనాలను వేగంగా నడపడమేనని తెలిపారు. రహదారి ప్రమాదాలు నివారించడానికి ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, వాహన తనిఖీలు చేపడుతున్నట్లుగా తెలిపారు.

శ్రీలక్ష్మి చెన్నకేశవునికి శాంతి కల్యాణం


హాజరైన ఉభయ దాతలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామికి అర్చకులు శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంభం రోడ్డులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచి కల్యాణం జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు ఏపీఆర్‌జేసీ మంజూరు చేయాలి

మార్కాపురం: పట్టణంలో ముస్లిం మైనార్టీలకు ఏపీఆర్‌జేసీ మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు పఠాన్ హుస్సేన్ ఖాన్, షేక్షావలి కోరారు. పశ్చిమ ప్రాంతంలో ఉన్న ముస్లిం విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయిస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు.

అర్హులకు కౌలు కార్డులు మంజూరు

పొదిలి: ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అర్హతలు ఉన్న రైతులకు మాత్రమే కౌలు కార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన సమావేశం జరిగింది. కృష్ణారెడ్డి మాట్లాడుతూ 11 నెలల కాలం మాత్రమే విలువ కలిగిన కార్డుదారులకు భూమిపై ఎటువంటి అధికారాలు ఉండవన్నారు. బోగస్‌కార్డులు ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయాధికారి షేక్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ కౌలుకార్డుల మూలంగా రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. రైతులు సాగు చేసిన పైర్లను ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం కౌలుదారులకు వచ్చే రాయితీలకు మాత్రమే కౌలుదారులు అర్హులవుతారన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులను, వీఆర్‌ఓలను కలిసి రైతులు వారి వద్ద ఉన్న అర్హత పత్రాలను చూపించి కౌలు కార్డులు పొందాలన్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాలు వేయవద్దు


బ్రిడ్జి పక్కన వ్యర్థాలు తొలగిస్తున్న జేసీబీ

పొదిలి: వ్యాపారులు, హోటల్ యజమానులు, చికెన్, మటన్ వ్యాపారులు రోడ్డు పక్కన వ్యర్థాలు వేయవద్దని నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి కోరారు. శనివారం ఆయన ఈద్గాను, పరిసరాలను సందర్శించారు. బక్రీద్ పర్వదినం నాటికి పరిసరాలను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. నగర పంచాయతీ పరిధిలో బ్రిడ్జిల పక్కన, కల్వర్టుల పక్కన వ్యర్థాలు వేయడంతో దుర్వాసనతో పాటు, దోమల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని చెప్పారు. వాటిని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఒకటికి రెండు పర్యాయాలు చెప్పి చూస్తామని, ఆ తర్వాత కూడా అలానే చేస్తుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. మార్కాపురం, దర్శి, ఒంగోలు రోడ్లలో శివారు ప్రాంతాల్లో భవనాలకు సంబంధించి కాంక్రీట్ వేస్టు వేసే వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నారాయణరెడ్డి కోరారు.

ఫ్రాంక్లిన్‌కు నివాళులర్పించిన ఉసురుపాటి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, తదితరులు

కంభం: అనారోగ్యంతో మృతిచెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పులుగుజ్జు ఫ్రాంక్లిన్ మృతదేహాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు లు సందర్శించి మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల ఉద్యమంలో కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వానికి ఎదిగిన పులుగుజ్జు ఫ్రాంక్లిన్ మరణించడం తీరని లోటన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొడిచర్ల రాజు, నేదరపల్లి జయరాజ్, ఆంజనేయులు, తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

రేపు బీజేపీ కిసాన్ మోర్చ సమావేశం

మార్కాపురం టౌన్: బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ సమావేశం జూన్ 2వ తేదీన మార్కాపురంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బొంతలకృష్ణ తెలిపారు. ముఖ్య అతిథులుగా కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, జాతీయ కార్యదర్శి సురేష్‌రెడ్డి, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వివరాలు తెలిపారు. పీవీ కృష్ణారావు, చిన్నయ్య, శాసనాల సరోజినీ పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



యోగా శిక్షణకు హాజరైన వివిధ శాఖల సిబ్బంది

మార్కాపురం: పట్టణంలోని డ్వాక్రా బజారులో శనివారం సాయంత్రం వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్, మండల పరిషత్ సిబ్బంది ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రైనర్ చలపతిరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఆరోగ్యానికి యోగా మంచిదని ఆయుష్ డాక్టర్ సైదులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు అకాడమీలో విద్యార్థులతో యోగా టీచర్ రామకృష్ణ యోగాసనాలు వేయించారు.